సాక్షి
జోగుళాంబ గద్వాల

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



..శివనామస్మరణం

అలంపూర్ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



అలంపూర్ ఆలయ ప్రాంగణంలో శివజ్యోతి దర్శనం

ఓం నమః శివాయ

- జిల్లాలో వైభవంగా మహా శివరాత్రి వేడుకలు
- రుద్ర నామస్మరణతో మార్మోగిన ఆలయాలు



శివాలయంలో ప్రత్యేక పూజలు



భక్తులతో రద్దీగా బీచుపల్లిలోని శివాలయం

గద్వాలటౌన్: ఓం నమః శివాయ.. హరహర మహాదేవ శంభో శంకర.. నామస్మరణతో పల్లె, పట్టణం మార్మోగింది. బుధవారం మహా శివరాత్రి వేళ భోళా శంకరుడిని భక్తులు భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. అభిషేకాలు, దీపారాధన, నైవేద్యాలు సమర్పించి శివయ్యను కొలిచారు. ఉదయాన్నే పుణ్య స్నానాలు ఆచరించి శివాలయాలకు తరలివెళ్లారు. భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అందులోను బుధవారం మహా శివరాత్రి పర్వదినం రావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో శైవక్షేత్రాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు శివుడి దర్శనాలు సాగాయి. రాత్రి శివ కల్యాణాలు కనులపండువగా జరిగాయి. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. జిల్లా కేంద్రంలోని స్థానిక నల్లకుంట కాలనీ, తెలుగుపేట కాలనీలలోని శివశంకర ఆలయాలు, కన్యాకాపరమేశ్వరి, వీరభద్రస్వామి, మార్కెండేయస్వామి, నందీశ్వర, భీమలింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. తెల్లవారుజామున నది అగ్రహారానికి వెళ్లి అక్కడ కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి స్ఫటిక శివలింగానికి అలాగే, తెలుగుపేటలోని శివాలయం, నందీశ్వర, భీమలింగేశ్వర ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, హోమాలు చేపట్టారు. గ్రామాలలో ఉన్న ఆలయాల దగ్గర భక్తుల సందడి కనిపించింది. ఆలయ నిర్వాహకులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి జాగరణ చేశారు.

బీచుపల్లి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు..

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆలయాలు మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం భక్తులతో కిక్కిరిశాయి. శివాలయం, అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం వంటి తదితర పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు గద్వాల, పెబ్బేర్, వనపర్తి, కొత్తకోట, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లి చేరుకొని కృష్ణానదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం శివాలయం, కోదండరామస్వామి, సరస్వతీదేవి అభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



గద్వాలలోని కృష్ణానది తీరంలో ఆలయానికి బారులు తీరిన భక్తులు



బీచుపల్లి ఆంజనేయస్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

శివజ్యోతి దర్శనం..

- జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర క్షేత్రానికి తరలివచ్చిన భక్తజనం
- ప్రత్యేక పూజల అనంతరం దీక్ష విరమించిన మాలధారులు

అలంపూర్: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరుడి క్షేత్రంలో బుధవారం అర్ధరాత్రి భక్తులకు శివజ్యోతి దర్శనం కలిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు అర్ధరాత్రి శివజ్యోతి కార్యక్రమం నిర్వహించారు. మాలధారులు పంచాక్షరి నామస్మరణతో శివజ్యోతిని నింగిలోకి వదిలగా హరహర మహాదేవ.. శంభో శంకర.. ఓం నమః శివాయ నామస్మరణలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు, మాలధారులు లింగోద్భవ సమయంలో నింగికెగిరిన శివజ్యోతిని వీక్షించారు. అంతకుముందు భక్తులు శివజ్యోతిని తలపై ఉంచుకొని నగర సంకీర్తనలు చేస్తూ.. బాణసంచా పేలుస్తూ భారీ ఊరేగింపుగా పట్టణంలో నుంచి ప్రధాన ఆలయమైన బాలబ్రహ్మేశ్వర ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయంపై సిద్ధం చేసిన జ్యోతిని నింగిలోకి వదిలారు. జ్యోతి దర్శనం **అనంతరం మాలధారులు లిం**గోద్భవ కాలంలో **దీక్ష విరమణ చేశారు.**



సాంస్కృతిక కార్యక్రమాలు



అలంపూర్‌లో శివజ్యోతి ఊరేగింపు



జోగుళాంబ ఆలయ సన్నిధిలోని పుష్కరఘాట్ వద్ద జాగరణలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షిస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని **జూరాల ప్రాజెక్టుకు** ఎగువ నుంచి **స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తుంది.** బుధవారం రాత్రి **9 గంటల వరకు 2,418** క్యూసెక్కుల ఇన్‌**ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికా**రులు తెలిపారు. **జూరాలలో నీటి మట్టం** తగ్గడంతో ఇటీవల **మంత్రి జూపల్లితో** పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, అధికారులు కర్ణాటక ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి 3 టీఎంసీల నీరు విడుదల చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆరు వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేయగా..జూరాలకు 2,418 క్యూసెక్కులు వస్తున్నట్లు అధికారులు చెప్పారు. నదిలోని గుంతల్లోకి ఎక్కువ నీరు చేరడంతో ఇక్కడికి వచ్చే సరికి స్వల్ప ఇన్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు. ఆవిరి రూపంలో 77 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 550 క్యూసెక్కులు, కుడి కాలువకు 400 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 338 క్యూసెక్కులు, ప్రాజెక్టు నుంచి మొత్తం 1364 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 4.905 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతుల ధర్నా



ధరూరు: వ్యవసాయ రంగానికి విధిస్తున్న కోతలకు నిరసిస్తూ అల్వాలపాడు సబ్ స్టేషన్ ముందు రాయిచూరు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. బుధవారం ఉదయం సబ్ స్టేషన్ పరిధిలోని రంగాపురం, గంగన్‌పల్లి, మైలగడ్డ, కోతులగిద్ద, అల్వాలపాడు తదితర గ్రామాలకు చెందిన రైతులు సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి అర గంట పాటు ధర్నా నిర్వహించారు. నెట్టెంపాడు కాలువకు నీళ్లు వదిలిన సమయంలో కోతలు విధించి రైతులు నీళ్లు పారించుకోకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడిగినా పట్టించుకునే నాథుడు కరువయ్యారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అల్వాలపాడు సబ్ స్టేషన్లో కోతలు విధిస్తున్నారని, విద్యుత్ సిబ్బంది ఆడిందే ఆట పాటడిందే పాటగా తయారైందని మండిపడ్డారు. ఈ సందర్భంగా రాయిచూరు రోడ్డుపై వాహనాలు నిలిచిపోయిన విషయాన్ని తెలుసుకున్న ట్రాన్స్‌కో డీఈ రమేష్ ఫోన్‌లో రైతులతో మాట్లాడారు. ఇలాంటి సమస్య మళ్లీ పునరావృతం కాకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే ఎస్‌ఎల్‌బీసీ ఘటన

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే ఎస్‌ఎల్‌బీసీ ఘటన జరిగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.సాగర్ ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. టన్నెల్ తవ్వకంలో ముందుజాగ్రత్తలు పాటించడంతో పాటు నిపుణుల సూచనలు, సలహాలు తీసుకుంటే ఎందుకిలా జరుగుతుందని మండిపడ్డారు. సమగ్ర విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది కార్మికులు క్షేమంగా బయటపడాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, వి.పద్మ, మోహన్ ఉన్నారు.

ధనార్జనే ధ్యేయంగా దందా

నకిలీ సర్టిఫికెట్ల కేసులో విస్తుపోయే నిజాలు

- ఒక్కో సర్టిఫికెట్ రూ.లక్షకుపైనే విక్రయం
- తాజాగా ప్రధాన సూత్రధారి బాలకృష్ణ అరెస్టు
- మిర్యాలగూడలో చిక్కిన నిందితుడు
- కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ మొగిలయ్య



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నకిలీ సర్టిఫికెట్లను చూపుతున్న డీఎస్పీ మొగిలయ్య

గద్వాల క్రైం: సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వారు నకిలీ సర్టిఫికెట్ల దందాకు తెరలేపారు. అందులోను ప్రధాన సూత్రధారి గతంలో పదేళ్ల కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో.. లేని కళాశాలను ఉన్నట్లుగా సృష్టించారు. నిరుద్యోగుల అవసరాన్ని అవకాశంగా మార్చుకొని ఒక్కో నకిలీ సర్టిఫికెట్‌ను రూ.లక్షకుపైనే విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు మరికొన్ని రాష్ట్రాల వారికి సర్టిఫికెట్లు విక్రయించినట్లు సమాచారం. నకిలీ డిప్లొమా సర్టిఫికెట్‌తో ఏఈఓగా ప్రభుత్వ ఉద్యోగం పొంది.. దాదాపు ఐదేళ్ల వ్యవసాయ శాఖలో పనిచేసిన వ్యక్తి వ్యవహారం ఇటీవల బయటపడిన విషయం తెలిసిందే. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. తాజాగా ఈ నకిలీ సర్టిఫికెట్ వ్యవహారంలో ప్రధాన సూత్రధారి నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన చెరువుపల్లి బాలకృష్ణను మంగళవారం రాత్రి గద్వాల పోలీసులు అరెస్టు చేసినట్లు డీఎస్పీ మొగిలయ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు.

పదేళ్లుగా గుట్టుగా దందా

ప్రధాన సూత్రధారి చెరువుపల్లి బాలకృష్ణ మిర్యాలగూడ పట్టణంలో ఓ జూనియర్ కళాశాలకు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారని, కొన్నాళ్లకు కళాశాలను నడిపించే ఆర్థిక స్థోమత లేక మూసి వేశారన్నారు. అప్పటి నుంచి ఎలాగైన డబ్బులు సంపదించాలనే లక్ష్యంతో పలు రాష్ట్రాలకు చెందిన వ్యక్తులతో ముఠాగా ఏర్పడి నకిలీ సర్టిఫికెట్ల దందాకు తెరలేపాడన్నారు. దాదాపు పదేళ్లుగా నకిలీ సర్టిఫికెట్ల మాఫియా దందాను గుట్టుగా సాగిస్తున్నాడని వివరించారు.

పట్టుబడ్డారిలా..

ఇదిలాఉండగా, జిల్లాలో నకిలీ సర్టిఫికెట్‌తో ఏఈఓ ఉద్యోగం పొందిన కాత్రావత్ నరేష్‌తో పాటు మరో వ్యక్తిని ఈ నెల 22న అరెస్టు చేశామన్నారు. అనంతరం ప్రధాన సూత్రధారులను పట్టుకునేందుకు దర్యాప్తు వేగవంతం చేశామన్నారు. పట్టుబడిన ఇద్దరు ఇచ్చిన సమాచారం మేరకు గద్వాల పోలీసు బృందం రెండు రోజుల క్రితం మిర్యాలగూడకు చేరుకున్నారని తెలిపారు. ఈక్రమంలోనే 25వ తేదీన మిర్యాలగూడ పట్టణ శివారులో గుర్తు తెలియని వ్యక్తులకు నకిలీ సర్టిఫికెట్లు అందిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు రెక్కీ నిర్వహించి బాలకృష్ణను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడి నుంచి మూడు నకిలీ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసులో బాలకృష్ణ ఏ3గా ఉన్నాడని తెలిపారు. ఇతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి వివరాలు వెల్లడించారని, త్వరలో అతడిని అదుపులోకి తీసుకుంటామన్నారు. 12 మందికి నకిలీ సర్టిఫికెట్లు అందించాడని అతను నేరం అంగీకరించాడన్నారు. ఇప్పటివరకు ఆరుగురి నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నామని, త్వరలో మిగతా వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు విషయంలో సీరియస్‌గా ఉందని, పట్టుబడిన నిందితుడిని గద్వాల కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసు విచారణలో సీఐ శ్రీను, ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్, సిబ్బంది చంద్రయ్య, ఇస్మాయేల్ కీలకంగా వ్యవహరించారన్నారు.

రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ ఎంపికలు



బాస్కెట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో బుధవారం రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహించారు. మొత్తం 80 మంది బాలికలు, 110 మంది బాలుర హాజరు కాగా.. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్యాట్రన్, న్యాయవాది మనోహర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ ఎంపికలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి.. జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్ మాట్లాడుతూ.. పుదుచ్చేరిలో ఏప్రిల్ 9నుంచి 16వ తేదీ వరకు 40వ యూత్ నేషనల్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ ఉంటుందని తెలిపారు. తెలంగాణ బాలబాలికల జట్లు ఈ టోర్నీలో పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నసరుల్లా హైదర్, చైర్మన్ మీర్ అర్షద్‌అలీ, ఉపాధ్యక్షులు సయ్యద్ షరీఫ్ అలీ, సుబాన్‌జీ, కార్యనిర్వాహక కార్యదర్శి మీర్ ఖాలిద్‌అలీ, కోశాధికారి ఎండీ ఇలియాజ్, పీడీ ముకర్రం పాల్గొన్నారు.

పండగ పూట విషాదం

- గుండాల కోనేరులో స్నానం చేస్తూ విద్యార్థి గల్లంతు
- ఆచూకీ కోసం శ్రమిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

వివరాలు 8లో..



కనిపించని పురోగతి

- ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న 8 మంది కోసం భగీరథ యత్నం
- నీటిని, బురద తొలగించడం పెద్ద సవాలే..
- రెండు రోజుల్లో తీసుకు వస్తామన్న మంత్రులు



సొరంగం కూలిపడిన ప్రాంతానికి సమీపంలో సహాయక బృందాలు

ఐదు రోజులైనా దొరకని కార్మికుల జాడ



టన్నెల్‌లో పరిస్థితిని అంచనా వేస్తున్న ఆర్మీ అధికారులు, సహాయక బృందాలు

అచ్చంపేట/అచ్చంపేట రూరల్/ఉప్పునుంతల: దోమలపెంట ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది కార్మికులను బయటికి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ప్రమాదం జరిగి ఐదు రోజులైనా ఇంత వరకు ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం న్యూఢిల్లీలోని బార్డర్స్ రోడ్స్ ఆర్గనైజేషన్, టన్నెల్ వర్క్స్‌లో నిష్ణాతులైన వారిని ప్రత్యేకంగా పిలిపించారు. సొరంగంలోకి వెళ్లి వచ్చిన రెస్క్యూ బృందాలు మాత్రం శిథిలాలను తొలగించడం.. అందులో చిక్కుకున్న కార్మికులను కాపాడటం కష్టంగా ఉందని చెబుతున్నారు. సొరంగంలో భారీగా మట్టి, రాళ్లు కూలి పడటంతో.. వాటిని కదిలిస్తే మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. శిథిలాలు, మట్టిని తొలగించేందుకు రోజులు పట్టవచ్చని చెబుతున్నారు. కాగా, ఉత్తరఖండ్‌లోని డెహ్రాడూన్‌లో 41 మందిని రక్షించినప్పటికీ అక్కడికి ఇక్కడికి పరిస్థితి పూర్తి భిన్నంగా ఉండటంతో ప్రయత్నాలు చేయడం కూడా కష్టంగా మారిందని రెస్క్యూ బృందాలు పేర్కొంటున్నాయి. దేశంలో ఇప్పటివరకు జరిగిన టన్నెల్ ప్రమాదాల్లో ఇదే అత్యంత కఠినమైనదని చెబుతున్నారు. అయితే 12 కి.మీ. వద్ద మరో మార్గం ద్వారా లోపలికి వెళ్లాలని సహాయక బృందాలు అన్వేషిస్తున్నాయి. సొరంగంపై నుంచి లేదా పక్క నుంచి రంధ్రం చేసేందుకు ఉన్న అవకాశాలపై ప్రయత్నాలు చేస్తున్నారు.

అంతుచిక్కడం లేదు..

సొరంగంలో చేరిన నీటిని, బురదను తొలగించి ఎనిమిది మంది ప్రాణాలను కాపాడటం పెద్ద సవాల్‌గా మారింది. ఈ ప్రమాదాన్ని అంచనా వేయడం నిపుణులు, ఇంజినీర్లు, రెస్క్యూ బృందాలను సైతం కలవరపెడుతోంది. ప్రపంచ దేశాల నుంచి వచ్చిన అనుభవజ్ఞులైన వారికి ఈ ప్రమాదం అంతుచిక్కడం లేదు. శిథిలాల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలనే దానిపై ఇప్పటి వరకు ఓ నిర్ణయానికి రాలేదు. లోపల ఉన్న బురద, రాళ్లు, నీటిని బయటికి తీసుకురావడం కష్టమన్న భావన వ్యక్తమవుతోంది. తెగిపోయిన కన్వేయర్ బెల్టును కూడా ఇప్పటి వరకు పునరుద్ధరించ లేదు. వాస్తవానికి టన్నెల్ బోరింగ్ మెషీన్ నడిస్తేనే ఈ బెల్టు పని చేస్తుంది.

కార్మికుల కుటుంబసభ్యుల్లో ఆందోళన..

సొరంగంలో చిక్కుకున్న వారు ఎక్కడున్నారో.. ఎలా ఉన్నారో అనే ఉత్కంఠ తారస్థాయికి చేరింది. ఎవరూ పట్టించుకోవడం లేదని.. ఇక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని కార్మికుల కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.

మంత్రుల పర్యవేక్షణ..

దోమలపెంట ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద చేపట్టిన సహాయక చర్యలను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పర్యవేక్షించారు. అనంతరం ఉన్నతాధికారులు, జేపీ కంపెనీ, వివిధ రెస్క్యూ బృందాలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలను రెస్క్యూ బృందాలు మంత్రుల దృష్టికి తీసుకువచ్చాయి. గాలి, వెలుతురు లేని సొరంగంలో ఆక్సిజన్ అందకపోవడంతో సహాయక బృందాలు ఎక్కువ సేపు ఉండలేకపోతున్నాయని.. ఆక్సిజన్ సిలిండర్లు సమకూర్చితే లోపల ఎక్కువ సమయం ఉండేందుకు అవకాశం ఉంటుందని.. ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు వ్యూహాలు రచించవచ్చని తెలిపారు.

మల్లెల తీర్థం జలపాతమే కారణమా?

సొరంగం ఘటన జరిగిన ప్రదేశం మల్లెలతీర్థం జలపాతం లోయ ప్రాంతం అయి ఉండవచ్చని వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచితలబైలు గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. దోమలపెంట ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఇన్‌లెట్ నుంచి 13.93 కి.మీ. వద్ద జరిగిన ప్రమాదాన్ని నేరుగా పరిశీలిస్తే.. ఆ ప్రాంత వరకు వెళ్తోంది. ఇక్కడ 500 అడుగుల ఎత్తు నుంచి నిరంతరం హోరెత్తుతూ దూకే జలధార మూడు సరస్సులను నింపుతూ.. నల్లమల అడవి గుండా కృష్ణానదిలో కలుస్తుంది. మల్లెల తీర్థంలో ఏడు గుండాలు ఉన్నాయి. ఈ గుండాల వద్దనే నీటి నిల్వ ఉంటుంది. ఇందులో ఏదో ఒకటి సొరంగం వద్ద లికేజీ అయి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొరంగంలో కిలోమీటరు వరకు సీపేజీ ఉండే అవకాశం ఉందని.. ముందే తెలిసినా జేపీ కంపెనీ తగిన జాగ్రత్తలు తీసుకోలేకపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఐదు రోజులైనా సహాయక చర్యల్లో ఎలాంటి పురోగతి లేదు. ఇప్పటి వరకు నెమ్మదిగా సాగిన సహాయక చర్యలను వేగవంతం చేసి.. రెండు రోజుల్లో ఎనిమిది మంది కార్మికులను బయటికి తెస్తామని మంత్రులు ప్రకటించారు.

హెలీప్యాడ్‌లు లేక..



ఆకాశంలో చక్కర్లు కొడుతున్న హెలికాప్టర్

సొరంగం ఘటన జరిగిన రోజు నుంచి రెండు, మూడు హెలికాప్టర్లు వచ్చి పోతున్నాయి. జేపీ కంపెనీ కార్యాలయం వద్ద ఒకటి నిలిచేందుకు హెలీప్యాడ్ ఉంది. ఒకటి వస్తే మరొకటి గాలిలో చక్కర్లు కొడుతుంది. కొన్ని సందర్భాల్లో సున్నిపెంట, శ్రీశైలం వెళ్లి ల్యాండ్ అవుతున్నాయి. బుధవారం మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి హెలికాప్టర్‌లో రాగా.. జేపీ కంపెనీ అధినేత జయప్రకాశ్‌గౌర్ మరో హెలికాప్టర్‌లో వచ్చారు. ఒక హెలీపోస్ట్ మాత్రమే ఉండటంతో దిగడానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో మరొకటి గాలిలోకి ఎగరాల్సి వచ్చింది. దీంతో హుటాహుటిన మరో హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు.



షెడ్డులోనే కార్మికులు

టన్నెల్ వద్దకు తమను పంపడం లేదని.. షెడ్‌లోనే బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నామని వాపోతున్నారు. ఎలాంటి సమాచారం లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని.. రోజుకు రెండు, మూడు హెలికాప్టర్లు రావడం చూసి ఏమైందోనన్న ఆందోళన చెందుతున్నామని గోడు వెలిబుచ్చారు.

తుంగా తీరం.. శివనామస్మరణం

అలంపూర్‌లో ఘనంగా శివరాత్రి వేడుకలు



బాలబ్రహ్మేశ్వరస్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు

- భారీగా తరలి వచ్చిన భక్తులు
- కిక్కిరిసిన ఆలయ పరిసరాలు

అలంపూర్: తుంగభద్ర నదీతీరాన వెలిసిన అలంపూర్ క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేలాదిగా భక్తులు తరలి వచ్చి బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం 4 నుంచి అర్ధరాత్రి లింగోద్భవ కాలం వరకు భక్తుల అభిషేకాలతో బ్రహ్మేశ్వర ఆలయం కిక్కిరిసింది. యాగశాలలో రుద్ర, ఆవాహిత హోమాలు, త్రికాల సమయంలో బలిహరణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు నదీతీరాన ఏర్పాటు చేసిన షవర్ల కింద స్నానాలు చేసి స్వామి, అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భారీసంఖ్యలో తరలిరావడంతో దర్శనానికి గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది. దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు భక్తులకు ఉచితంగా మజ్జిగ, నీటి సీసాలు, ప్రసాదం అందజేశారు. ఆర్య వైశ్య సంఘం, వివేకానంద యూత్‌తో పాటు పలువురు దాతలు అల్పాహారం, పండ్లు, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఆలయాలను దర్శించుకున్న ప్రముఖులు..



బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఎస్పీ శ్రీనివాసరావు పూజలు

అలంపూర్ క్షేత్ర ఆలయాలను బుధవారం దర్శించుకున్నారు గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం, జోగుళాంబ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ఒంగోలు మాజీ ఎమ్మెల్సీ పోతుల సునీత సురేష్ కుటుంబం, డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాత కుటుంబం స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. నిత్యహోమ పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం ఇవ్వగా ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించారు.

రద్దీగా రహదారులు..

అలంపూర్ చౌరస్తా నుంచి వాహనాలు బారులు తీరాయి. జోగుళాంబ రైల్వే స్టేషన్ వద్ద గేటు పడిన ప్రతిసారి వాహనాలు బారులుగా నిలిచి ట్రాఫిక్ సమస్య తలెత్తింది. రద్దీని దృష్టిలో ఉంచుకొని వాహనాలను కోర్టు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో నిలిపేశారు. ద్విచక్ర వాహనాలను ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పార్కింగ్ చేయించారు. అక్కడి నుంచి ఆలయాల వరకు కాలినడకన చేరుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ఉచిత ఆటోల ద్వారా తరలించారు.

ప్రత్యేక కార్యక్రమాలు..

అలంపూర్ క్షేత్రంలో జాగరణ చేసేందుకు భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. భజనలు, అనమయ్య సంకీర్తనలు, నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు. అలంపూర్ సీఐలు రవిబాబు, టాటాబాబు, ఎస్‌ఐ వెంకటస్వామి ఆధ్వర్యంలో 10 మంది ఎస్‌ఐలు, 30 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 40 మంది మహిళా పోలీసులు, కానిస్టేబుల్స్, హోంగార్డులు, ఏఆర్ పోలీసులు మొత్తం 250 మంది బందోబస్తు నిర్వహించారు.

ఆలయంలో భక్తుల రద్దీ →



కనులపండువగా కల్యాణోత్సవం



స్వామి,అమ్మవార్ల విగ్రహాలను తీసుకువస్తున్న ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్ దంపతులు

- సంప్రదాయ పద్ధతిలో భౌరమ్మ, మల్లికార్జున స్వామివార్ల కల్యాణం
- భౌరాపూర్‌కు తరలివచ్చిన చెంచులు
- పెళ్లిపెద్దలుగా ఎమ్మెల్యే, డిప్యూటీ కలెక్టర్ దంపతులు
- భౌరాపూర్ ఆలయానికి పూజారిని నియమిస్తాం: ఎమ్మెల్యే వంశీకృష్ణ
- పలు శాఖల స్టాళ్లు ఏర్పాటు

అచ్చంపేట/మన్ననూర్: లింగాల మండలం భౌరాపూర్ చెంచుపెంటలోని భ్రమరాంబిక ఆలయంలో భ్రమరాంబిక, మల్లికార్జున స్వామివార్ల కల్యాణం బుధవారం చెంచులు వైభవంగా నిర్వహించారు. ఏటా మహా శివరాత్రి పర్వదినాన భౌరమ్మ(భ్రమరాంబిక)ను తమ ఆడబిడ్డగా మల్లికార్జున స్వామిని అల్లుడిగా భావించి చెంచులు కల్యాణం జరిపిస్తారు. ఈ కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి చెంచులు అధికంగా తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమశాఖ, ఐటీడీఏ ఆధ్వర్యంలో అధికారికంగా ఈ వేడుకలను నిర్వహిస్తోంది. చెంచులు తమ సంప్రదాయ నృత్యాలతో భౌరమ్మ, మల్లిఖార్జున స్వామివార్లకు ఎదుర్కోళ్లు నిర్వహించారు. దేవతామూర్తుల విగ్రహాలను కొప్పెరలో ఉంచి తప్పట్ల చప్పుళ్లతో ఆలయ సన్నిధికి తీసుకొచ్చారు. చెంచు పూజారి మల్లయ్య కల్యాణాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ, అనురాధ దంపతులు స్వామివారి తరుపున, అమ్మవారి తరుపున డిప్యూటీ కలెక్టర్ అమరేందర్ దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించి కల్యాణాన్ని జరిపించారు.

పకడ్బందీ ఏర్పాట్లు

భౌరాపూర్ ఉత్సవాల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. నల్లమలలో తరుచూ జరిగే అగ్ని ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఫైరింజన్లను అందుబాటులో ఉంచారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐలు రవీందర్ బందోబస్తు ఏర్పాటుచేశారు. జీసీసీ, ఆర్టీటీ, వైద్యారోగ్య, స్త్రీ,శిశు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖలు, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యుఎస్‌లకు సంబంధించిన ప్రభుత్వ స్టాళ్లను ఏర్పాటుచేశారు. ఉత్సవాలకు వచ్చిన భక్తుల తాగునీటి, భోజన, వసతి ఏర్పాట్లు చేశారు. ఐటీడీఏ అధికారులు 12ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటుచేయడంతో వివిధ ప్రాంతాల నుంచి చెంచులుగా భారీగా తరలివచ్చారు.

చెంచుల అభ్యున్నతికి కృషి

చెంచుజాతి అభ్యున్నతికి రాష్ట్రప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. ఐటీడీఏ రెగ్యూలర్ పీఓ నియమించాలని, పీసా చట్టం పూర్తిస్థాయిలో అమలు చేయాలని, అటవీ హక్కుల చట్టాన్ని ఉమ్మడిగా అమలు చేయాలని, ప్రత్యేక ప్యాకేజీ కింద చెంచులందరీకి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని, ఐటీడీఏ చెంచులను మినహా ఇతర కులాల వారీని చేర్చొద్దని చెంచులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని, ఐటీడీఏ రెగ్యులర్ పీఓ ఆరుమాసాల్లో నియమిస్తామని హామీ ఇస్తామన్నారు. టూరిజం ద్వారా చెంచులను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని, చెంచులు దీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భౌరాపూర్ ఆలయాన్ని ధూపదీప నైవైద్యం కింద ఎంపిక చేసి అక్కడ రెగ్యులర్‌గా పూజారి ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. భౌరాపూర్ చెరువును ఆధునీకీకరించి పర్యాటకంగా తీర్చి దిద్దుతామన్నారు. కార్యక్రమంలో డీటీడీఓ ఫిరంగి, ఐటీడీఏ అధికారి జాఫర్ ఉస్సెన్, జీసీసీ మేనేజర్ సంతోష్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ హేమలత, చెంచునాయకులు గురువయ్య, మల్లికార్జున్, శంకరయ్య, చీరరాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఎదుర్కోళ్లు నిర్వహిస్తున్న చెంచులు



కల్యాణానికి హాజరైన భక్తులు

క్లుప్తంగా

మహిళ దారుణ హత్య

భూత్పూర్: స్థానిక మునిరంగస్వామి దేవాలయం సమీపంలో బుధవారం తెల్లవారుజామున మహిళ దారుణ హత్యకు గురైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. వివరాలు.. మండలంలోని కొత్తమొల్గరకి చెందిన రంగమ్మ(50)కు కల్లు తాగే అలవాటు ఉంది. తరుచూ ఇంట్లో చెప్పాపెట్టకుండా వెళ్లిపోయి తిరిగి కొన్నిరోజులకు వచ్చేది. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఇంట్లో చెప్పకుండానే వెళ్లిపోయింది. బుధవారం ఉదయం దేవాలయం సమీపంలో రంగమ్మ గాయాలతో కొన ఊపిరితో ఉండగా పూజారి గమనించి స్థానికులకు సమాచారమిచ్చారు. వెంటనే జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి ఆరుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. భర్త సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బస్సు కిందపడి బాలుడు మృతి



అరుణ్ (ఫైల్)

దోమలపెంట/మన్ననూరు: శ్రీశైలానికి బైక్‌పై వస్తూ ప్రమాదవశత్తు బస్సు కింద పడి ఓ బాలుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. అచ్చంపేట సమీపంలో ఉన్న నడింపల్లికి చెందిన అరుణ్ (15) మహా శివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలంలో స్వామివారి దర్శనం నిమిత్తం స్నేహితుడితో కలిసి బైక్‌పై బయలుదేరాడు. దోమలపెంట అటవీ చెక్‌పోస్ట్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న తాసిపెంట వద్ద ముందుగా వెళ్తున్న తాండూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా ఆటో వచ్చింది. దానికి బైక్ హ్యాండిల్ తగలడంతో బైక్ అదుపుతప్పి పడిపోయింది. బైక్‌పై వెనుక కూర్చున్న అరుణ్ బస్సు కిందపడ్డాడు. దీంతో బస్సు టైర్లు అతడిపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న మరో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈగలపెంట పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి వీరిని ఆస్పత్రికి తరలించేందుకు కటకం రాములమ్మ ఫౌండేషన్‌కు ఫోన్ చేశారు. వారి అంబులెన్స్ రాగా మృతుడు అరుణ్, గాయపడ్డ మరో యువకుడిని అమ్రాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అరుణ్ నడింపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఈగలపెంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహంతో రాస్తారోకో..

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు, గ్రామస్తులు మన్ననూర్ అంబేడ్కర్ కూడలిలో మృతదేహంతో గంట పాటు రాస్తారోకో చేపట్టారు. దీంతో ప్రధాన రహదారిపై వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. డిపో మేనేజర్, బాధితులతో పోలీసులు మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు.



రాస్తారోకో చేస్తున్న బాధిత బంధువులు, గ్రామస్తులు

పండగ పూట విషాదం



కోనేరులో సహాయ చర్యలు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది

- కోనేరులో స్నానం చేస్తూ విద్యార్థి గల్లంతు
- గాలిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది
- మోటార్ల సాయంతో బయటకు నీటి తోడివేత



ఓమేష్(ఫైల్)

వెల్దండ: మహా శివరాత్రి పండుగ వేళ దేవాలయంలోని కోనేరులో స్నానం చేస్తూ ఓ విద్యార్థి గల్లంతైన విషాద ఘటన మండలంలోని గుండాలలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. కల్వకుర్తి పట్టణం జేపీ నగర్‌లోని ఎస్సీ గురుకుల సీఓఈ కళాశాలల్లో చదువుతున్న ఐదు మంది విద్యార్థులు కళాశాల నుంచి దైవదర్శన నిమిత్తం గుండాలకు వచ్చారు. దైవ దర్శనానికి ముందు విద్యార్థులు కోనేరులో స్నానాలు చేసేందుకు వెళ్లారు. పేరుమాండ్ల ఓమేష్(17)అనే విద్యార్థి ప్రమాదవశాత్తు కోనేరులో జారిపడ్డాడు. స్నేహితులు ఆనంద్, సందీప్, బాలకిషన్, జెట్టిచరణ్ అటుఇటు చూసే సరికి ఓమేష్ నీటిలో మునిగిపోయాడు. కోనేరులో నీరు ఎక్కువగా ఉండి పాచి రావడంతో జారిపడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అగ్రిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్ల సహాయంతో వెతుకులాట ప్రారంభించారు. ఈతగాళ్లకు కూడా ఆచూకీ లభించకపోవడంతో నాలుగు మోటార్ల సహయంతో నీటిని బయటకు తోడుతున్నారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం మన్ననూర్‌కి చెందిన ఓమేష్ ఇంటర్ సెకండియర్(ఎంపీసీ) చదువుతున్నాడు. విద్యార్థి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. శివాలయ కోనేరులో ప్రమాద ఘటన సంభవించడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొనగా దర్శనం నిలిపేశారు. సహయక చర్యల్లో వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఐలు కురుమూర్తి, మహేందర్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సహాయక చర్యలు పరిశీలించిన ఎమ్మెల్యే..

కోనేరులో విద్యార్థి గల్లంతైన విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గుండాలకు చేరుకొని సహాయక చర్యలపై ఆరా తీశారు. విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారమిచ్చి సహాయక చర్యలు వేగవంతం చేయాలని అక్కడి అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అదే సమయంలో దర్శనానికి వచ్చిన టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శివదీక్ష విరమణకు శ్రీశైలానికి వచ్చి..

- పాతాళగంగలో మునిగి తండ్రీకొడుకు మృతి
- మృతులు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వాసులు

దోమలపెంట: శివదీక్ష విరమణకు శ్రీశైలానికి వచ్చిన తండ్రీకొడుకులు పాతాళగంగలో స్నానమాచరిస్తూ మునిగి మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. ఈగలపెంట హెడ్‌కానిస్టేబుల్ శివాజీ తెలిపిన వివరాలు.. ఏపీలోని కృష్ణా జిల్లా (ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా) కొలకిల గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు పెరుగు గురునాథం(35), ఆయన కుమారుడు పెరుగు వాసు(10) శివ మాలధారణ చేశారు. బుధవారం ఉదయం ఆరుగంటల సమయంలో దీక్ష విరమణకు కృష్ణానదిలో స్నానమాచరిస్తున్నారు. నదిలోతు అంచనా వేయకుండా వారు ముందుకెళ్లారు. నీటిలో మునిగిపోతున్న కొడుకు వాసును కాపాడే ప్రయత్నంలో గురునాథం సైతం నీటి మునిగి ఇద్దరూ మృతి చెందారు. ఈగలపెంట ఎస్‌ఐ వీరమల్లు పోలీసలతో కలిసి ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గజ ఈతగాళ్ల సహాయంతో ఇరువురి మృతదేహాలను బయటకు తీసి శ్రీశైలం ప్రాజెక్టు కుడి కాలనీ సున్నిపెంటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పంచనామా అనంతరం మృతదేహాలను వారి కుటుంబీలకు అప్పగించారు.



పాతాళగంగ వద్ద కృష్ణానదిలో నీటమునిగి మృతి చెందిన తండ్రి కొడుకు

భౌరాపూర్ చెరువులో మునిగి యువకుడు మృతి

మన్ననూర్: భౌరాపూర్ చెరువులో మునిగి ఓ చెంచు యువకుడు మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం బిల్లకల్లుకి చెందిన ఆంజనేయులు (25) భౌరాపూర్ చెంచు జాతరకు తన కూతురు, గ్రామస్తులతో కలిసి మంగళవారం ఆర్టీసీ బస్సులో బయలుదేరి వెళ్లాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం 8:30 గంటల ప్రాంతంలో ఈత కొట్టేందుకు పక్కనే ఉన్న భౌరాపూర్ చెరువులో తలకిందులుగా దూకాడు. దీంతో తల భాగం చెరువులోని బురదలో చిక్కుకొని మృతిచెందినట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది. మృతదేహాన్ని వెలికితీసి ఓ ప్రత్యేక వాహనంలో మృతుడి స్వగ్రామానికి తరలించారు.

వ్యక్తి బలవన్మరణం

హన్వాడ: మండలంలోని నాగినోనిపల్లికి చెందిన పల్లె సత్తయ్య (57) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. సత్తయ్య కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం పొలం వద్దకు వెళ్లి పురుగుమందు తాగగా గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

వృద్ధురాలిపై తేనెటీగల దాడి

ఖిల్లాఘనపురం: ఓ వృద్ధురాలిపై తేనెటీగలు దాడిచేసిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బుడగజంగం బుడ్డమ్మ బుధవారం వీరన్నగుట్టకు వెళ్లగా తేనెటీగలు వెంటపడ్డాయి. దీంతో ఆమె గుట్ట కిందిభాగాన చింతచెట్ల దగ్గరకు పరుగు తీసినా వదల్లేదు. చివరకు స్పృహ తప్పి చెట్టుకింద పడిపోగా గ్రామస్తులు కొందరు గమనించి దగ్గరకు వెళ్లగా వారి వెంట పడ్డాయి. చాలాసేపటికి కుటుంబసభ్యులు, గ్రామస్తులు వృద్ధురాలిని అక్కడి నుంచి తప్పించి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి.. పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఓవర్‌స్పీడ్‌తో కారు బోల్తా



మహబూబ్‌నగర్ క్రైం: పాలమూరు పట్టణంలో ఓవర్ స్పీడ్ కారణంగా కార్లు తరుచూ బోల్తా పడుతున్నాయి. వారం రోజుల క్రితం ఏనుగొండలో ఓ కారు బోల్తా పడింది. అదిమరవకముందే బుధవారం తెల్లవారుజామున ఓ కారు ఓవర్ స్పీడ్ కారణంగా బైపాస్ రోడ్‌లో బోల్తాపడింది. మహబూబ్‌నగర్‌కు చెందిన నలుగురు యువకులు హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు కారులో వస్తున్నారు. బైపాస్ రోడ్‌లో ఓవర్ స్పీడ్ కారణంగా అదుపుచేయలేకపోవడంతో పల్టీలు కొడుతూ ప్రమాదానికి గురైంది. కారులో ఉన్న నలుగురికి ఎలాంటి గాయాలు కాలేదు. రోడ్లు విశాలంగా మారడంతో అర్ధరాత్రి, తెల్లవారుజామున రోడ్లపై ఎక్కువ ట్రాఫిక్ లేకపోవడంతో కార్లు, ద్విచక్ర వాహనదారులు ఓవర్ స్పీడ్‌తో వెళ్తున్నారు. ఆ సమయంలో పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు యువకులు ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. మరి కొందరు యవకులు అర్ధరాత్రి బైపాస్ రోడ్‌పై బైక్ రేసింగ్ చేపడుతున్నారు.

మన్యంకొండకు పోటెత్తిన భక్తులు



కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- శివాలయంలో ప్రత్యేక పూజలు
- ప్రత్యేక బస్సులు నడిపిన ఆర్టీసీ



అలంకరణలో శివలింగం



మన్యంకొండ శివాలయంలో హారతి ఇస్తున్న అర్చకులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. దీంతో మన్యంకొండ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు ఉపవాస దీక్షలతో మన్యంకొండకు చేరుకొని స్వామివారికి పూజలు చేశారు. దేవస్థానం ముందు ఉన్న కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకొన్నారు. శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు కోనేరు నుంచి గర్బగుడి వరకు అక్కడి నుంచి శివాలయం వరకు దైవదర్శనానికి బారులు తీరారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన దాసంగాలు పెట్టి మొక్కులు సమర్పించగా మరికొంత మంది తలనీలాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. శివలింగాన్ని రకరకాల పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబుచేశారు. దేవస్థాన వ్రత మండపంలో భక్తులు వ్రతాలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ నుంచి మన్యంకొండకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారితో పాటు పాలకమండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం

మానవపాడు: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన ఘటన మండలంలోని పల్లెపాడులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పల్లెపాడుకు చెందిన ఆర్.నరేష్‌కు పాడి పశువులు ఉండడంతో దొడ్డిలో గడ్డివామును ఏర్పాటు చేశాడు. ప్రమాదవశాత్తు గడ్డి వాము దగ్ధం కావడంతో వెంటనే గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్‌ఇంజన్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని మంటలు ఆర్పేశారు. అనంతరం కోదండాపురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంలో రూ.80వేల విలువైన పశుగ్రాసం దగ్ధమైందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

